# కరన్ కేక

**పంజాబ్ కింగ్స్..ఢిల్లీ క్యాపిటల్స్‌పై పంజా విసిరింది. సమిష్టి ప్రదర్శనతో సత్తాచాటుతూ అద్భుత విజయంతో లీగ్‌లో అదిరిపోయే బోణీ కొట్టింది. అర్ష్‌దీప్‌సింగ్, హర్షల్ పటేల్ రాణింపుతో ఢిల్లీ స్వల్ప స్కోరుకే పరిమితమైంది. ఆఖరి ఓవర్లో అభిషేక్ పోరెల్ వీరవిహారంతో ఢిల్లీ పరువు దక్కించుకుంది. లక్ష్యఛేదనలో ఆదిలోనే పంజాబ్ వికెట్లు కోల్పోయినా ఆల్‌రౌండర్ సామ్ కరన్ విజృంభణకు లివింగ్‌స్టోన్ జత కలువడంతో పంజాబ్ తొలి విజయాన్ని ఖాతాలో వేసుకుంది. ఘోర రోడ్డు ప్రమాదంలో గాయపడి కోలుకున్న రిషబ్ పంత్ తిరిగి 14 నెలల తర్వాత పోటీకి దిగి తన సత్తాచాటాడు. అచంచలమైన ఆత్మవిశ్వాసంతో తాను ప్రాణంగా ప్రేమించే క్రికెట్‌లోకి పంత్ పడిలేచిన కెరటంలా వచ్చాడు.**


కరన్ (63)

చండీగఢ్: ఐపీఎల్ డబుల్ ధమాకా తొలి పోరులో ఢిల్లీ క్యాపిటల్స్‌పై పంజాబ్ కింగ్స్‌దే పైచేయి అయ్యింది. శనివారం జరిగిన పోరులో పంజాబ్ 4 వికెట్ల తేడాతో ఢిల్లీపై అద్భుత విజయం సాధించింది. తొలుత ఢిల్లీ 20 ఓవర్లలో 9 వికెట్లకు 174 పరుగులు చేసింది. షాయి హోప్(33) టాప్ స్కోరర్‌గా నిలువగా, యువ క్రికెటర్ అభిషేక్ పోరెల్(10 బంతుల్లో 32 నాటౌట్, 4ఫోర్లు, 2 సిక్స్‌లు) ధనాధన్ ఇన్నింగ్స్‌తో ఢిల్లీ పోరాడే స్కోరు అందుకుంది. అర్ష్‌దీప్‌సింగ్ (2/28), హర్షల్ పటేల్ (2/47) రాణించారు. ఆ తర్వాత లక్ష్యఛేదనకు పంజాబ్.. సామ్ కరన్(47 బంతుల్లో 63, 6ఫోర్లు, సిక్స్) ధనాధన్ అర్ధసెంచరీకి తోడు లివింగ్‌స్టోన్ (38 నాటౌట్) రాణించడంతో 19.2 ఓవర్లలో 177/6 స్కోరు చేసింది. కుల్దీప్‌యాదవ్(2/20), ఖలీల్ అహ్మద్(2/43)రెండేసి వికెట్లు తీశారు. అర్ధసెంచరీతో జట్టు విజయంలో కీలకంగా వ్యవహరించిన కరన్‌కు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' దక్కింది.

**కరన్ జోరు:**

కెప్టెన్ శిఖర్ ధవన్ (22) ఆది నుంచే దూకుడుగా ఆడే ప్రయత్నం చేసినా.. జానీ బెయిర్‌స్టో (9) నిరాశపరిచాడు. ఇషాంత్‌శర్మ వేసిన ఇన్నింగ్స్ 3వ ఓవర్లో ముందుకొచ్చి ఆడబోయిన ధవన్ క్లీన్‌బౌల్డ్ అయ్యాడు. నాలుగు బంతుల తేడాతో బెయిర్‌స్టో అనూహ్యంగా రనౌట్ కావడంతో పంజాబ్ 42 పరుగులకే ఓపెనర్ల వికెట్లు కోల్పోయింది. ఆ తర్వాత క్రీజులోకొచ్చిన ప్రభ్‌సిమ్రన్‌సింగ్(26), కరన్ ఇన్నింగ్స్‌ను చక్కదిద్దే ప్రయత్నం చేశారు. వచ్చి రావడంతోనే ప్రభ్‌సిమ్రన్ జోరు కనబరిచాడు. బౌండరీలతో స్కోరుబోర్డును పరిగెత్తిస్తున్న ప్రభ్‌సిమన్‌ను బౌలింగ్ మార్పుగా వచ్చిన కుల్దీప్ ఔట్ చేశాడు. ఆ తర్వాత జితేశ్(9) నిరాశపర్చడంతో పంజాబ్ 100 పరుగులకు నాలుగు కీలక వికెట్లు కోల్పోయింది. ముఖ్యంగా కరన్ బౌండరీలే లక్ష్యంగా జోరు కనబరిచాడు. మార్ష్ వేసిన 18వ ఓవర్లో కరన్ ఫోర్, సిక్స్‌తో చెలరేగితే..లివింగ్‌స్టోన్ సిక్స్ అరుసుకున్నాడు. అయితే ఖలీల్ 19వ ఓవర్లో వరుస బంతుల్లో కరన్‌తో పాటు శశాంక్‌సింగ్(0)ను ఔట్ చేసి గెలుపుపై ఆశలు రేపాడు. ఆఖర్లో లివింగ్‌స్టోన్ సిక్స్‌తో మ్యాచ్‌ను ముగించాడు.

### అర్ధసెంచరీతో విజృంభణ
### ఢిల్లీపై పంజాబ్ విజయం
### 14 నెలల తర్వాత పంత్ పోటీలోకి


పంత్ (18)

**14 నెలల తర్వాత..**

రిషబ్ పంత్ 14 నెలల తర్వాత తిరిగి మైదానంలో అడుగుపెట్టాడు. ఘోర రోడ్డు ప్రమాదంలో ప్రాణాలతో బయటపడ్డ పంత్.. పలు కఠోరమైన ఫిట్‌నెస్ పరీక్షలను దాటుకుని తిరిగి క్రికెట్‌లోకి వచ్చాడు. గత ఐపీఎల్ సీజన్‌కు పూర్తిగా దూరమైన ఈ ఢిల్లీ కెప్టెన్.. పంజాబ్‌తో మ్యాచ్‌లో రీ ఎంట్రీ ఇచ్చాడు. బ్యాటింగ్‌లో 18 పరుగులు చేసిన పంత్.. స్టంపింగ్‌తో పాటు క్యాచ్‌తో ఆకట్టుకున్నాడు.

**సంక్షిప్త స్కోర్లు**

**ఢిల్లీ:** 20 ఓవర్లలో 174/9(హోప్ 33, పోరెల్ 32 నాటౌట్, అర్ష్‌దీప్‌సింగ్ 2/28, హర్షల్‌పటేల్ 2/47), **పంజాబ్:** 19.2 ఓవర్లలో 177/6(కరన్ 63, లివింగ్‌స్టోన్ 38 నాటౌట్, కుల్దీప్ 2/20, ఖలీల్ 2/43)

## సచిన్ సూచనతో.. ధోనీకి భారత కెప్టెన్సీ

ముంబై: సచిన్ టెండూల్కర్, మహేంద్రసింగ్ ధోనీ..భారత క్రికెట్ దిగ్గజాలు. దేశానికి ఈ ఇద్దరు క్రికెటర్లు ఎన్నో చిరస్మరణీయ విజయాలు అందించారు. అయితే కెరీర్ తొలినాళ్లలో ధోనీ బ్యాటింగ్ స్టయిల్‌ను మాస్టర్ ఫిదా అయిపోయాడట. ఈ విషయాన్ని సచిన్ తాజాగా పంచుకున్నాడు. 2004 బంగ్లాదేశ్‌తో సిరీస్ సందర్భంగా ధోనీ షాట్లు చూసి తాను ఆశ్చర్యానికి గురైనట్లు సచిన్ చెప్పుకొచ్చాడు. దీనికి తోడు 2007లో తనకు వచ్చిన కెప్టెన్సీ అవకాశాన్ని వదులుకున్న సచిన్..సెలెక్టర్లకు ధోనీ పేరును సూచించాడట. మాస్టర్ మాటకు కట్టుబడ్డ సెలెక్టర్లు 2007 టీ20 ప్రపంచ కప్ టోర్నీకి భారత జట్టుకు ధోనీని కెప్టెన్‌గా నియమించింది.

## లంకకు భారీ ఆధిక్యం

సిల్హెట్(బంగ్లాదేశ్): బంగ్లాదేశ్‌తో జరుగుతున్న తొలి టెస్టులో శ్రీలంక భారీ ఆధిక్యం దిశగా సాగుతున్నది. శనివారం ఆట ముగిసే సరికి లంక రెండో ఇన్నింగ్స్‌లో 5 వికెట్ల నష్టానికి 119 పరుగులు చేసింది. ఓపెనర్ దిముత్ కరుణరత్నె(52) మినహా అందరూ స్వల్ప స్కోర్లకే పరిమితమయ్యారు. బంగ్లా బౌలింగ్ దాడిని దీటుగా ఎదుర్కొంటూ కరుణరత్నె తన ఇన్నింగ్స్‌లో ఏడు ఫోర్లు, భారీ సిక్స్‌తో ఆకట్టుకున్నాడు. రానా(2/42) రెండు వికెట్లు పడగొట్టాడు. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 32/3 తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన బంగ్లా 188 పరుగులకు కుప్పకూలింది.

## షహార్యార్‌ఖాన్ కన్నుమూత



లాహోర్: భారత్, పాకిస్థాన్ క్రికెట్ సంబంధాల పునరుద్ధరణలో కీలకంగా వ్యవహరించిన పాక్ క్రికెట్ బోర్డు (పీసీబీ) మాజీ చైర్మన్ షహార్యార్‌ఖాన్ (89) శనివారం కన్నుమూశారు. గత కొంత కాలంగా తీవ్ర అనారోగ్య సమస్యలతో సతమవుతున్న షహార్యార్‌ఖాన్ తుదిశ్వాస విడిచారు. భోపాల్ (మధ్యప్రదేశ్)లో జన్మించిన ఖాన్..దేశ విభజన సమయంలో పాక్‌కు వలస వెళ్లారు. భారత మాజీ కెప్టెన్ మన్సూర్‌అలీఖాన్ పటౌడీకి సోదరుడైన ఖాన్ 2003-06 మధ్య కాలంలో పీసీబీ చైర్మన్‌గా పనిచేశారు.


క్లాసెన్ (63)

వావ్..వావ్! వర్ణించడానికి మాటల్లేవ్! శనివారం ఈడెన్ గార్డెన్స్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్, కోల్‌కతా నైట్‌రైడర్స్ మధ్య హై వోల్టేజ్ పోరు చూసిన ఫ్యాన్స్‌కు కలిగిన అనుభూతి ఇది. కోల్‌కతా నిర్దేశించిన 209 పరుగుల భారీ లక్ష్యఛేదనలో హైదరాబాద్ ఆఖరి మెట్టుపై బోల్తా కొట్టింది. పోరాడితే పోయేదేమి లేదన్న తరహాలో గెలుపు ఆశలు అడుగంటిన వేళ క్లాసెన్ తుఫాన్ ఇన్నింగ్స్‌తో సన్‌రైజర్స్ ఫినిక్స్ పక్షిలా లేచింది. విజయానికి ఆరు బంతుల్లో 13 పరుగులు అవసరమైన దశలో తొలి బంతిని భారీ సిక్స్‌గా మలిచిన క్లాసెన్..జట్టును గెలిపించలేకపోయాడు. రానా బౌలింగ్‌లో క్లాసెన్, షాబాజ్ ఔట్ కావడంతో హైదరాబాద్ ఓటమివైపు నిలిచింది. తొలుత రస్సెల్ వీరవిహారంతో కోల్‌కతా భారీ స్కోరు అందుకుంది. సుడిగాలి ఇన్నింగ్స్‌తో రస్సెల్..హైదరాబాద్ బౌలర్లను ఊచకోత కోశాడు.

రస్సెల్ తుఫాన్ ఇన్నింగ్స్

# రైజర్స్ బోల్తా

### క్లాసెన్ ఒంటరి పోరు వృథా • కోల్‌కతా ఉత్కంఠ విజయం

కోల్‌కతా: ఐపీఎల్-17వ సీజన్‌లో మూడో మ్యాచే అభిమానులను ఓ ఊపు ఊపింది. ఆఖరి బంతి వరకు ఊపిరి బిగపట్టి చూసిన మ్యాచ్‌లో కోల్‌కతా 4 పరుగుల తేడాతో సన్‌రైజర్స్ హైదరాబాద్‌పై ఉత్కంఠ విజయం సాధించింది. కోల్‌కతా నిర్దేశించిన 209 పరుగుల లక్ష్యఛేదనలో హైదరాబాద్ 204/7 స్కోరు చేసింది. క్లాసెన్ (29 బంతుల్లో 63, 8 సిక్స్‌లు) ఒంటరిపోరాటం జట్టును గెలిపించలేకపోయింది. మయాంక్ అగర్వాల్ (32), అభిషేక్ (32)రాణించారు. హర్షిత్‌రానా (3/33), రస్సెల్ (2/25) ఆకట్టుకున్నారు. తొలుత రస్సెల్(25 బంతుల్లో 64 నాటౌట్, 3ఫోర్లు, 7 సిక్స్‌లు) ధనాధన్ ఇన్నింగ్స్‌కు తోడు సాల్ట్(54), రమన్‌దీప్‌సింగ్(35) రాణింపుతో కోల్‌కతా 20 ఓవర్లలో 208/7 స్కోరు చేసింది. నటరాజన్ (3/32), మార్కండే (2/39) ఫర్వాలేదనిపించారు. ఆల్‌రౌండ్ ప్రదర్శన కనబరిచిన రస్సెల్‌కు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' దక్కింది.

**రస్సెల్ X క్లాసెన్:**

కోల్‌కతా, హైదరాబాద్ ఐపీఎల్ పోరులో రస్సెల్, క్లాసెన్ ఇన్నింగ్స్ అదిరిపోయింది. ఓవైపు హైదరాబాద్ బౌలింగ్ దాడిని చీల్చిచెండాడుతూ రస్సెల్ వీరవిహారం చేస్తే..మరో ఎండ్‌లో క్లాసెన్ కోల్‌కతా బౌలర్ల వెన్నులో వణుకు పుట్టించాడు. 119 పరుగులకే 6 వికెట్లు కోల్పోయి కష్టాల్లో ఉన్న కోల్‌కతాను రస్సెల్ ఒడ్డున పడేశాడు. నరైన్ (2), అయ్యర్ (0), నితీశ్‌రానా (9) స్వల్ప స్కోర్లకే పరిమితమయ్యారు. ఈ దశలో రస్సెల్ తన హార్డ్‌హిట్టర్‌ను పరిచయం చేశాడు. ఏ మాత్రం కనికరం లేకుండా రైజర్స్ బౌలింగ్‌ను చీల్చిచెండాడుతూ ఫోర్లు, సిక్సర్లతో ఈడెన్ గార్డెన్‌ను హోరెత్తించాడు. ఈ క్రమంలో అర్ధసెంచరీ మార్క్ అందుకున్న రస్సెల్ ఏ ఒక్క బౌలర్‌ను విడిచిపెట్టలేదు. మరోవైపు లక్ష్యఛేదనలో మెరుగైన శుభారంభం అందుకున్న హైదరాబాద్..అదే దూకుడు ఆఖరి వరకు కొనసాగించలేకపోయింది. విజయానికి 18 బంతుల్లో 60 పరుగులు అవసరమైన దశలో క్లాసెన్, షాబాజ్ అహ్మద్ ఆకాశమే హద్దుగా చెలరేగారు. అప్పటి వరకు గెలుపే కష్టం అనుకున్న హైదరాబాద్ ఆశలను చిగురింపజేస్తూ క్లాసెన్ కొట్టిన కొట్టుడుకు స్టేడియం హోరెత్తిపోయింది. అయితే ఆఖరి ఓవర్లో రానా మ్యాజిక్‌తో హైదరాబాద్ గెలుపు వాకిట బోర్లా పడింది.


రస్సెల్ (64*)

**8** హైదరాబాద్ తరఫున ఐపీఎల్‌లో అత్యధిక సిక్స్‌లు బాదిన బ్యాటర్‌గా క్లాసెన్ నిలిచాడు. ఇంతకు ముందు వార్నర్, మనీశ్ పాండే(8) ఉన్నారు.

**15** కోల్‌కతాతో మ్యాచ్‌లో హైదరాబాద్ ఇన్నింగ్స్‌లో నమోదైన సిక్స్‌లు. ఇప్పటి వరకు ఇదే అత్యధికం.

**సంక్షిప్త స్కోర్లు**

**కోల్‌కతా:** 20 ఓవర్లలో 208/7(రస్సెల్ 64 నాటౌట్, సాల్ట్ 54, నటరాజన్ 3/32, మార్కండే 2/39), **హైదరాబాద్:** 20 ఓవర్లలో 204/7(క్లాసెన్ 63, అభిషేక్ 32, హర్షిత్ 3/33, రస్సెల్ 2/25)

# ఇక బీమా సుగమ్

### ఆమోదం తెలిపిన ఐఆర్‌డీఏఐ
### అందుబాటులోకి వస్తున్న ఈ-కామర్స్ వేదిక



న్యూఢిల్లీ, మార్చి 23: బీమా పాలసీల క్రయవిక్రయాలతోపాటు ఇతరత్రా సేవలు, క్లెయిమ్‌ల సెటిల్మెంట్ కోసం ఓ సరికొత్త వేదిక అందుబాటులోకి వస్తున్నది. తాజాగా జరిగిన తమ 125వ బోర్డు సమావేశంలో ఇన్సూరెన్స్ రెగ్యులేటరీ అండ్ డెవలప్‌మెంట్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఐఆర్‌డీఏఐ) ఈ మేరకు నిర్ణయం తీసుకున్నది. దీంతో ఆన్‌లైన్ ఇన్సూరెన్స్ మార్కెటింగ్‌కు వీలుగా ఓ ఈ-కామర్స్ వేదికకు లైన్‌క్లియరైంది. బీమా సుగమ్ పేరిట వస్తున్న దీనికి ఐఆర్‌డీఏఐ ఆమోదముద్ర వేసింది. ఐఆర్‌డీఏఐ రెగ్యులేషన్స్ 2024తో మరో ఏడు ఇతర రెగ్యులేషన్లకూ బీమా రంగ రెగ్యులేటర్ ఈ సందర్భంగా పచ్చ జెండా ఊపింది.

**ఏమిటీ బీమా సుగమ్?**

ఇదో ఆన్‌లైన్ ఇన్సూరెన్స్ మార్కెటింగ్ వేదిక. పాలసీదారులు, బీమా సంస్థలు, మధ్యవర్తులు, ఏజెంట్లు ఇలా అందరికీ వన్ స్టాప్ సొల్యూషన్‌గా ఈ బీమా సుగమ్‌ను తీర్చిదిద్దారు. పాలసీదారులు ఇక్కడ బీమాలను కొనేటప్పుడు అనేక రకాలుగా విశ్లేషించి, ఇతర ప్రత్యామ్నాయాలతో పోల్చిచూసుకునే సౌలభ్యం ఉంటుంది. జీవిత, ఆరోగ్య, జనరల్ ఇలా అన్ని విభాగాల్లోగల ఇన్సూరెన్స్‌లను ఇక్కడ అమ్ముకోవచ్చు లేదా కొనుక్కోవచ్చు. సులభంగా వాటి సెటిల్మెంట్లనూ చేసుకోవచ్చు. 'దేశీయ బీమా రంగంలోని అన్ని పనులూ ఇక్కడ అత్యంత ప్రభావవంతంగా, పారదర్శకంగా జరుగుతాయి' అని ఐఆర్‌డీఏఐ ఓ ప్రకటనలో స్పష్టం చేసింది. ఇక పాలసీదారుల ప్రయోజనాలకు పెద్ద పీట వేయడం జరుగుతుందన్న ఐఆర్‌డీఏఐ.. సరసమైన ధరలకు పాలసీలు లభిస్తాయని, 2047కల్లా దేశంలోని అందరికీ బీమా సదుపాయాన్ని అందించాలనే కల కూడా తీరగలదన్న ఆశాభావాన్ని వ్యక్తం చేసింది.

**పేపర్ వర్క్ లేదు**

ప్రస్తుతం భౌతిక మార్కెట్‌లో సంప్రదాయబద్ధంగా ఏజెంట్లు, బ్రోకర్ల ద్వారా కొనే పాలసీల కోసం అనేక రకాల పేపర్లను నింపి, మరెన్నో ధ్రువపత్రాలను జతచేసి సమర్పించాల్సిన అవసరం పాలసీదారులకు ఉంటున్నది. అయితే సుదీర్ఘ పనికి ఈ-ఫార్మాట్ ఇన్సూరెన్స్ చెక్ పెడుతుందని అంటున్నారు. పాలసీ రెన్యువల్స్ లేదా క్లెయిమ్ సమయంలో భౌతిక డాక్యుమెంట్లను సమర్పించాల్సి ఉంటుందని చెప్తున్నారు. మొత్తంగా ఎలక్ట్రానిక్ విధానంలో సులభంగా మీ చేతికి పాలసీని అందించడమే బీమా సుగమ్ లక్ష్యమని పేర్కొంటున్నారు. 'ద్రవ్య వ్యవస్థలో యూపీఐ ఎంతటి సంచలన మార్పులను తెచ్చిందో.. బీమా రంగంలోనూ బీమా సుగమ్ అంతే సంచలనం' అని ఐఆర్‌డీఏఐ చైర్మన్ దేబాశిష్ పాండా అన్నారు.

## జీల్యాబ్ ప్రచారకర్తగా రణ్‌దీప్ హుడా

న్యూఢిల్లీ, మార్చి 23: ప్రముఖ ఫార్మా సంస్థ జీల్యాబ్ ప్రచారకర్తగా..వీర్ సావర్కర్ సినిమా నటుడు రణ్‌దీప్ హుడా నియమితులయ్యారు. మరోవైపు, రోగులపై పడుతున్న ఆర్థిక భారాన్ని తగ్గించుకునేందుకు సంస్థ అన్ని రకాల ఔషధాలను 90 శాతం వరకు తగ్గింపు ధరకు విక్రయిస్తున్నట్లు ప్రకటించింది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 200కి పైగా సొంతంగా రిటైల్ అవుట్‌లెట్లను కలిగివున్న సంస్థ..2 వేలకు పైగా ఫ్రాంచైజ్ పద్ధతిన స్టోర్లను నిర్వహిస్తున్నట్లు కంపెనీ ఫౌండర్ రోహిత్ ముకుల్ తెలిపారు. అలాగే ప్రతి నెల 20 వేలకు పైగా ఆన్‌లైన్ ఆర్డర్లు వస్తున్నాయన్నారు. వచ్చే మూడేండ్లలో దేశవ్యాప్తంగా 2 వేలకు పైగా సొంత అవుట్‌లెట్లతోపాటు 5 వేల ఫ్రాంచైజ్ అవుట్‌లెట్లు ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు.






వాణిజ్య

# క్రెడిట్ కార్డులదే హవా

### రూ.1.7 లక్షల కోట్లకు చేరిక
### జనవరిలో 30 శాతం పెరిగిన వాడకం

న్యూఢిల్లీ, మార్చి 23: దేశంలో క్రెడిట్ కార్డుల వినియోగం పెరిగిపోతున్నది. ఆయా బ్యాంకులు ఆకర్షణీయ ఆఫర్లతో అందిస్తుండటం, అవసరాలకు బాగా పనికొస్తుండటంతో ఇప్పుడు అంతా క్రెడిట్ కార్డులను వాడేస్తున్నారు. ఈ క్రమంలోనే ఈ ఏడాది జనవరిలో క్రెడిట్ కార్డుల వినియోగం దేశంలో గత జనవరితో పోల్చితే 30 శాతం పెరిగినట్టు తేలింది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) వివరాల ప్రకారం ఈ లావాదేవీల విలువ రూ.1.7 లక్షల కోట్లకు చేరింది. ఇకపోతే నిరుడు జనవరితో పోల్చితే ఈ ఏడాది జనవరిలో ఒక్కో కార్డుపై జరిగిన సగటు లావాదేవీ విలువ రూ.16,769గా నమోదైంది. ఏడాది క్రితంతో చూస్తే 8 శాతం వృద్ధి ఉన్నది. కార్డులు కూడా డిసెంబర్ 31న 97.9 మిలియన్లుగా ఉంటే.. ఈ జనవరి 31న 99.5 మిలియన్లకు పెరిగాయి. గత ఏడాది జనవరితో చూస్తే 21 శాతం వృద్ధి కనిపిస్తుండటం గమనార్హం.

**ఈ-కామర్స్‌కు..**

దేశంలో అంతకంతకూ పెరుగుతూపోతున్న ఈ-కామర్స్ వ్యాపారానికి.. క్రెడిట్ కార్డులు దన్నుగా నిలుస్తున్నాయి. ఆన్‌లైన్ కొనుగోళ్లు ఎక్కువగా క్రెడిట్ కార్డుల ద్వారానే జరుగుతున్నట్టు తాజాగా తేలింది. అలాగే పాయింట్ ఆఫ్ సేల్ (పీవోఎస్) టెర్మినల్స్ దగ్గర కూడా క్రెడిట్ కార్డుల హవానే నడుస్తున్నది. నిజానికి గూగుల్ పే, ఫోన్‌పే, పేటీఎం వంటి యూపీఐ సేవలతో జరిగే లావాదేవీలు రికార్డు స్థాయిలో ఉంటున్నా.. వీటికి సమానంగా ఇంకా క్రెడిట్ కార్డులకు ఆదరణ ఉంటుండటం విశేషం.

**56 శాతం వాటా**

దేశీయంగా ప్రస్తుతం చలామణిలో ఉన్న క్రెడిట్ కార్డుల్లో ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్బీఐ), ప్రైవేట్ రంగ బ్యాంకింగ్ దిగ్గజాలు హెచ్‌డీఎఫ్‌సీ, ఐసీఐసీఐ బ్యాంక్‌లకు చెందినవే దాదాపు 56 శాతంగా ఉన్నాయి. అయితే ఎస్బీఐతోపాటు హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్‌ల వాటా గతంతో పోల్చితే కొంతమేర తగ్గినట్టు తాజా లెక్కల్లో స్పష్టమైంది. ఇక క్రెడిట్ కార్డు లావాదేవీల్లో హెచ్‌డీఎఫ్‌సీ, ఐసీఐసీఐ, ఎస్బీఐ వినియోగదారుల వాటా సుమారు 63 శాతంగా ఉన్నది. క్రెడిట్ కార్డులతో కొనుగోలు చేస్తున్నవారిలో ఇండస్ ఇండ్ బ్యాంక్, ఆర్బీఎల్ బ్యాంక్, కొటక్ మహీంద్రా బ్యాంక్ వినియోగదారులు కాస్త తగ్గుముఖం పట్టినట్టు కూడా తెలుస్తున్నది.

**ఇదీ సంగతీ..**

క్రెడిట్ కార్డులను పద్ధతిగా వాడితే ఎన్ని ప్రయోజనాలుంటాయో.. అదుపు తప్పితే అంతే నష్టాలు కూడా ఉంటాయని ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు. కార్డుకున్న పరిమితిలో 70 శాతాన్ని మించి ఖర్చు చేయరాదని, గడువులోగా చెల్లింపులు పూర్తిగా చేసేయాలని కూడా బ్యాంకింగ్ నిపుణులు సూచిస్తున్నారు. కొంతమేర చేసే చెల్లింపులతో వడ్డీ భారం తెలియకుండా మీద పడుతుందని, చివరకు క్రెడిట్ స్కోర్‌నూ ఇబ్బందుల్లో పడేస్తుందని వారు గుర్తుచేస్తున్నారు. ఇక అవసరమైతే తప్ప క్రెడిట్ కార్డులతో కొనుగోళ్లకు దిగవద్దని, అనవసరపు కొనుగోళ్లకు వెళ్తే ఆర్థిక క్రమశిక్షణ కొరవడుతుందని కూడా క్రెడిట్ కార్డు కస్టమర్లకు సలహా ఇస్తున్నారు.

# ఆఫీస్ స్పేస్ హాట్‌కేక్

### హైదరాబాద్‌లో జనవరి-మార్చి మధ్యకాలంలో భారీగా ఎగిసిన డిమాండ్

న్యూఢిల్లీ, మార్చి 23: దేశవ్యాప్తంగా ఆఫీస్ స్థలాలకు డిమాండ్ అంతకంతకు పెరుగుతున్నది. దేశీయ, అంతర్జాతీయ కార్పొరేట్ సంస్థలు కొత్తగా కార్యాలయాలను ఏర్పాటు చేస్తుండటంతో ఆఫీస్ స్థలాలు హాట్‌కేకుల్లా అమ్ముడుపోతున్నాయి. ఈ జనవరి-మార్చిలో ఆరు మెట్రో నగరాల్లో ఆఫీస్ స్థలాల లీజులో 35 శాతం వృద్ధి నమోదైందని రియల్ ఎస్టేట్ కన్సల్టెంట్ కొల్లీర్స్ ఇండియా తాజాగా వెల్లడించింది. దేశవ్యాప్తంగా టాప్-6 నగరాలైన బెంగళూరు, ఢిల్లీ-ఎన్‌సీఆర్, ముంబై, చెన్నై, హైదరాబాద్, పుణెలలో 13.6 మిలియన్ల చదరపు అడుగుల విస్తీర్ణం కలిగిన ఆఫీస్ స్థలాన్ని లీజుకు తీసుకునే అవకాశాలున్నాయని పేర్కొంది. ఏడాది క్రితం ఇదే త్రైమాసికంలో ఇది 10.1 మిలియన్ చదరపు అడుగులుగా ఉన్నది. హైదరాబాద్‌తోపాటు ముంబై, బెంగళూరు, ఢిల్లీ-ఎన్‌సీఆర్‌లలో ఆఫీస్ స్థలాల లీజు పెరగగా, కానీ, చెన్నైలో తగ్గుముఖం పట్టింది. హైదరాబాద్‌లో అత్యధికంగా 2.9 మిలియన్ చదరపు అడుగుల స్థలం లీజుకు తీసుకున్నారని నివేదిక వెల్లడించింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో తీసుకున్నదాంతో పోలిస్తే రెండు రెట్లు పెరిగినట్లు వెల్లడించింది. ఈ త్రైమాసికంలో ఇప్పటికే కార్పొరేట్ సంస్థలు తమ లీజుకు సంబంధించిన ఒప్పందాలు కుదుర్చుకున్నాయని, అలాగే వచ్చేవారంలో కేవలం మూడు రోజులు మాత్రమే ఉండటంతో ఈ నివేదికను విడుదల చేశామని వెల్లడించింది.

- ముంబైలో ఆఫీస్ స్థలం డిమాండ్ 90 శాతం ఎగబాకి 1 మిలియన్ చదరపు అడుగుల నుంచి 1.9 మిలియన్ చదరపు అడుగులకు చేరుకోనున్నది.
- బెంగళూరులో కార్యాలయాల స్థలం 25 శాతం పెరిగి 4 మిలియన్ చదరపు అడుగులకు చేరుకోనున్నది. గతేడాది ఇది 3.2 మిలియన్ చదరపు అడుగులుగా ఉన్నది.
- ఢిల్లీ-ఎన్‌సీఆర్‌లో 2.5 మిలియన్ చదరపు అడుగుల స్థలం లీజుకు తీసుకునే అవకాశం ఉన్నది. క్రితం ఏడాది కంటే ఇది 14 శాతం అధికం.
- చెన్నైలో ఆఫీస్ స్పేస్ డిమాండ్ 6 శాతం తగ్గి 1.6 మిలియన్ చదరపు అడుగుల నుంచి 1.5 మిలియన్ చదరపు అడుగులకు తగ్గింది.
- టెక్నాలజీ, ఇంజినీరింగ్, తయారీ, బీఎఫ్ఎస్ఐ రంగ సంస్థలు అత్యధికంగా ఆఫీస్ స్థలాలను లీజుకు తీసుకుంటున్నాయి. మొత్తం లీజులో 58 శాతం ఈ రంగ సంస్థలదే కావడం విశేషం.
- ఆర్థిక రంగం పరుగులు పెడుతుండటం, ప్రతిభ కలిగిన సిబ్బంది లభిస్తుండటంతో అంతర్జాతీయ సంస్థలు ఇక్కడ తమ కార్యాలయాలను ఏర్పాటు చేయడానికి ఆసక్తి చూపుతున్నాయి.



**ఆఫీస్ స్థలాల డిమాండ్**

| నగరం | క్యూ1 2024 (మిలియన్ చ.అ.) | క్యూ1 2023 (మిలియన్ చ.అ.) | తేడా (శాతంలో) |
|---|---|---|---|
| బెంగళూరు | 4 | 3.2 | 25 |
| హైదరాబాద్ | 2.9 | 1.3 | 123 |
| ఢిల్లీ-ఎన్‌సీఆర్ | 2.5 | 2.2 | 14 |
| ముంబై | 1.9 | 1 | 90 |
| చెన్నై | 1.5 | 1.6 | -6 |
| పుణె | 0.8 | 0.8 | - |
| దేశవ్యాప్తంగా | 13.6 | 10.1 | 35 |

హైదరాబాద్‌లో కమర్షియల్ ఆఫీస్ స్థలానికి డిమాండ్ నిరాటంకంగా కొనసాగుతున్నది. గ్లోబల్ కెపబిలిటీ సెంటర్లను ఏర్పాటు చేయడానికి దేశీయ, అంతర్జాతీయ సంస్థలు ముందుకు రావడం ఇందుకు కలిసొస్తున్నది. చౌక ధరలు, మౌలిక సదుపాయాల కల్పనతో పెట్టుబడిదారులు నగర బాటపట్టారు. హై-టెక్ సిటీ, గచ్చిబౌలీ, మాదాపూర్‌లలో అత్యధికంగా లీజుకు తీసుకుంటున్నారు.

*- అర్పిత్ మెహరోత్రా, కొల్లీర్స్ ఇండియా ఎండీ*

## ఫారెక్స్ రిజర్వులు మరింత పైకి

ముంబై, మార్చి 23: విదేశీ మారకం నిల్వలు రికార్డు స్థాయికి చేరువయ్యాయి. గత కొన్ని వారాలుగా పెరుగుతూ వచ్చిన ఫారెక్స్ రిజర్వులు ఈ నెల 15తో ముగిసిన వారాంతానికి 6.396 బిలియన్ డాలర్లు పెరిగి 642.492 బిలియన్ డాలర్లకు చేరాయి. ఈ విషయాన్ని రిజర్వుబ్యాంక్ తాజాగా వెల్లడించింది. అంతక్రితం వారంలోనూ రిజర్వులు 10.47 బిలియన్ డాలర్లు పెరిగిన విషయం తెలిసిందే. అక్టోబర్ 2021లో ఫారెక్స్ రిజర్వులు చారిత్రక గరిష్ఠ స్థాయి 645 బిలియన్ డాలర్లకు చేరుకున్న విషయం తెలిసిందే. విదేశీ కరెన్సీ రూపంలో ఉన్న ఆస్తుల విలువ పెరగడం వల్లనే రిజర్వులు అంతకంతకు పెరుగుతున్నాయి. గత వారంలో 6.034 బిలియన్ డాలర్లు ఎగబాకి 568.386 బిలియన్ డాలర్లకు చేరాయని సెంట్రల్ బ్యాంక్ తన నివేదికలో వెల్లడించింది. అలాగే గోల్డ్ రిజర్వులు 425 మిలియన్ డాలర్లు ఎగబాకి 51.14 బిలియన్ డాలర్లకు చేరుకోగా, స్పెషల్ డ్రాయింగ్ రైట్స్ కింద రిజర్వులు 65 మిలియన్ డాలర్లు అధికమై 18.276 బిలియన్ డాలర్లకు చేరాయి. అలాగే ఐఎంఎఫ్ వద్ద ఉన్న నిల్వలు 129 మిలియన్ డాలర్లు తరిగిపోయి 4.689 మిలియన్ డాలర్లకు పరిమితమయ్యాయి.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.